
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 3 ၊ జూన్ ၊ 2025

I



సోమశిలలో 41.923 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 41.923 టీఎంసీలు ఉన్నాయి. 390 క్యూసెక్కుల వరద వస్తుండగా, డెల్టాకు 3,180, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,646
3 శాతం జీఎస్టీతో	రూ.6,845
నవర (8 గ్రా)	రూ.54,760

గరిష్టం/కనిష్టం
39.1 /29.9

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 42 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

12న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12వ తేదీన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నామని జెడ్పీ సీఈఓ విద్యారమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలకు జెడ్పీటీసీలు ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగాహాజరు కావాలని కోరారు.

6న ఐటీఐ కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025–26 విద్యా సంవత్సరంలో సీట్లు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 6న స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలురు ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 1 నుంచి 200 వరకు ఎస్ఎస్‌సీలో 10 నుంచి 5.7 మెరిట్, మధ్యాహ్నం 201 నుంచి 412 వరకు 5.5 నుంచి 3వ వరకు మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ బాలుర ఐటీఐలో సంప్రదించాలన్నారు.

6 నుంచి డీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఈ నెల 6వ తేదీ నుంచి 30 వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నట్లు డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి వచ్చే సమయంలో హాల్ టికెట్‌లో ఫొటోలు లేని వారు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఫొటో గుర్తింపు కార్డులను తీసుకు రావాలన్నారు. హాల్ టికెట్‌లో పుట్టిన తేదీ, నివాసం, పేర్లు తదితరాలు తప్పులు ఉంటే పరీక్ష తేదీన సెంటరులోని చీఫ్ సూపరింటెండెంట్ వద్ద ఉండే నామినల్ రోల్స్‌లో సరి చేసుకోవాలన్నారు.

నేరస్తులపై ఉక్కుపాదం

- పోలీసు అధికారులను ఆదేశించిన ఐజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ

నెల్లూరు (క్రైమ్): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరినీ ఉపేక్షించొద్దు. నేరస్తులపై ఉక్కుపాదం మోపండి. తొలుత కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేయండి, అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతోపాటు అవసరమైతే ఆస్తులను జప్తు చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు అధికారులతో జిల్లా పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐజీ మాట్లాడుతూ నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, డ్రోన్ సర్వైలెన్స్‌ను పెంచాలన్నారు. రౌడీషీటర్లు, డీసీలు, కేడీలు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. పదే పదే నేరాలకు పాల్పడుతోన్న వారిని గుర్తించి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. తీరు మారని వారిపై అవసరమైతే పీడీయాక్ట్‌లు నమోదు చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసుల్లో దర్యాప్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదృశ్యం, చిన్నారులు, మహిళలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు కేసుల పెండెన్సీని తగ్గించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలన్నారు. తొలుత జిల్లాలో కేసుల పెండెన్సీని తగ్గించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ జి.కృష్ణకాంత్ ఐజీకి వివరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ తీగలే.. యమపాశాలు

- 11 కేవీ వైరు తగిలి ఇద్దరు కంటైనర్ల డ్రైవర్ల మృతి
- మృతులు తమిళనాడు వాసులు





రొయ్యల గుంతల వద్ద ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్లు దక్షిణామూర్తి వైద్యనాథన్, సుబ్రహ్మణ్యం మణి

విడవలూరు: వేలాడే కరెంట్ తీగలు వారి పాలిట యమపాశాలుగా మారాయి. బతుకుదెరువు కోసం తమిళనాడు నుంచి ఊరు గాని ఊరు వచ్చి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన మండలంలోని ముదివర్తిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రం చెట్టికుప్పంకు చెందిన దక్షిణామూర్తి వైద్యనాథన్ (40) సుబ్రహ్మణ్యం మణి (44), వినయగమ్ అక్కడే గోల్డ్ మెరైన్ హార్వెస్ట్ హేచరీ నుంచి రొయ్య పిల్లల లోడుతో మూడు కంటైనర్లలో బయలుదేరి ఆదివారం రాత్రి మండలంలోని ముదివర్తిలో కనుపర్తి రాధయ్య రొయ్యల గుంతల వద్దకు చేరుకున్నారు. రొయ్య పిల్లలు అన్‌లోడ్ అయిన తర్వాత దక్షిణామూర్తి వైద్యనాథన్ కంటైనర్‌ను రివర్స్ చేస్తున్న క్రమంలో చీకట్లో 11 కేవీ వైరు స్తంభం నుంచి కింద జారి ఉండడాన్ని గమనించకపోవడంతో వైరు లారీ వెనుక భాగంలో తగిలింది. దీంతో కంటైనర్‌కు స్పార్క్ రావడంతో పక్కనే ఉన్న మరో ఇద్దరు లారీ డ్రైవర్లు పెద్దగా కేకలు వేశారు. దీంతో వైద్యనాథన్ లారీ నుంచి కిందకు దూకే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై అక్కడే పడిపోయాడు. ఆయన్ను కాపాడే క్రమంలో మరో కంటైనర్ డ్రైవర్ సుబ్రహ్మణ్యం మణికి లారీ తగలడంతో ఆయన కూడా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు దీంతో చుట్టు పక్కల ఉన్న వారు వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కరెంట్ కట్ చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న దక్షిణామూర్తి వైద్యనాథన్ తమ్ముడు సుబ్బారాయన్ ఆర్ముగమ్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. దీంతో రెండు కంటైనర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీజీహెచ్‌లో ఇద్దరు కంటైనర్ డ్రైవర్ల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): దేశ వ్యాప్తంగా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. గత నెల 18న నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జిల్లాకు చెందిన పలువురు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. మధుకిరణ్ 133, పూర్వజ్ 332, సంతోష్ 1361 భానురిషిక్ 1563, అఖిలేష్ 2323, యశ్వంత్‌బాబి 2481, సాయిసాత్విక్ 2517 ర్యాంకులు సాధించారు.

బాంబే ఐఐటీలో చదవాలని ఉంది



నా తండ్రి కె.రమేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి శ్రీవల్లి గృహిణి. నేను జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 332వ ర్యాంకు సాధించాను. బాంబే ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్‌గా పనిచేయాలని ఉంది.

– పూర్వజ్, బ్రహ్మదేవం

ఉత్తమ ఐఐటీలో చేరడమే లక్ష్యం



నా తండ్రి శివరామకృష్ణారావు వ్యాపారి. తల్లి ఉమామహేశ్వరి గృహిణి. నేను జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 1,361 ర్యాంకు సాధించాను. భవిష్యత్‌లో ఉత్తమ ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం.

– సంతోష్, మాగుంటలేవుట్

సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడతా



నా తండ్రి రమణయ్య, తల్లి ఉమామహేశ్వరి ప్రభుత్వ ఉద్యోగులు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నేను జాతీయ స్థాయిలో 1,563 ర్యాంకు సాధించాను. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం.

– భానురిషిక్, జేమ్స్‌గార్డెన్, నెల్లూరు

టెకీగా పనిచేయడమే లక్ష్యం



నా తండ్రి ద్వారకానాథ్‌రెడ్డి, తల్లి సుధీర ప్రభుత్వ ఉపాధ్యాయులు. నేను జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 2,517వ ర్యాంకు సాధించాను. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేయడమే నా లక్ష్యం.

– సాయిసాత్విక్, కోట

మైనింగ్ కేసులో మరో ఇద్దరికి నోటీసులు

పొదలకూరు : రుస్తుం మైన్ కేసులో వరదాపురానికి చెందిన డీ శ్రీనివాసులురెడ్డి, డీ మురళీకృష్ణారెడ్డిలకు నెల్లూరురూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు సోమవారం నోటీసులు జారీచేశారు. ఈమేరకు డీఎస్పీ కార్యాలయంలో సోమవారం వారిద్దరిని విచారించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి వరదాపురానికి చెందిన సోదరులిద్దరిని విచారించినట్లు సమాచారం.

జంతు వధపై కఠిన చర్యలు

నెల్లూరు (పొగతోట): బక్రీద్ పండగ రోజున ఈ నెల 7న జంతువులను వధించినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రమేష్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా నోడల్ అధికారిగా డీడీ డి మాధవీలతను నియమించారన్నారు. జంతు సంరక్షణ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎక్సైజ్ డీసీగా శంకరయ్య

నెల్లూరు (క్రైమ్): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్‌గా ఎం.శంకరయ్యను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీసీగా పని చేస్తున్న టి. శ్రీనివాసరావు గత నెలలో ఉదద్యోగ విరమణ చేశారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ హెడ్‌క్వార్టర్స్‌లో వెయిటింగ్‌లో ఉన్న శంకరయ్యను నెల్లూరు డీసీగా నియమించారు.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు మౌలాలి. బుజబుజ నెల్లూరు వాసి. దివ్యాంగుడు. చేతుల్లేకపోవడంతో ఆయన భార్య ద్వారా రేషన్ తీసుకునేవాడు. ఇటీవల ఆమె చనిపోయింది. దీంతో మౌలాలీకి రేషన్ సరుకులు ఇవ్వడం ఆపేశారు. ఈయనకు ఆధార్ కార్డు కూడా లేదు. దీనిపై అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఐరిస్ బయోమెట్రిక్ ద్వారా పింఛన్ ఇస్తున్నారని, రేషన్ విషయంలో అలాగే చేయాలని అధికారులకు వినతిపత్రమిచ్చాడు.



ఈమె పేరు మైలాపూరు వెంకట భవాని. నెల్లూరులోని మన్సూర్ నగర్ వాసి. తల్లిదండ్రులు చనిపోవడంతో రేషన్‌కార్డు తీసేశారు. భవానీకి రెండు కిడ్నీలు చెడిపోవడంతో డయాలసిస్ చేయించుకుంటోంది. కార్డు కోసం సచివాలయంలో అడిగితే రాదని చెప్పారు. వైట్ రేషన్‌కార్డు ఉంటేనే ఆరోగ్యశ్రీ కార్డు వస్తుందని దీంతో ఉచితంగా డయాలసిస్ చేయించుకునేందుకు వీలవుతుందని ఆమె చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పింఛన్ కూడా రాలేదని వాపోతోంది. తనకు బాబాయ్ గార్డియన్‌గా ఉన్నాడని, ఉన్నతాధికారులు దయ చూపాలని అభ్యర్థించారు.

సత్వర పరిష్కారం చూపాలంటూ..

- నెల్లూరులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 402 వినతుల అందజేత
- హామీలు నెరవేర్చాలంటూ సీపీఐ ధర్నా
- రేషన్‌కార్డుల కోసం పలువురి వినతి



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్, ఇతర అధికారులు ప్రజల నుంచి 402 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 169, పోలీస్ శాఖవి 47, మున్సిపల్ శాఖవి 38, సర్వేవి 29, పంచాయతీరాజ్ శాఖవి 23 తదితర అర్జీలందాయి. కార్యక్రమంలో డీఆర్వో ఉదయ భాస్కర్, డ్వామా పీడీ గంగాభవాని, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌ఓ సుజాత, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 23 ప్రకారం బదిలీల్లో విభిన్న సామర్థ్యం ఉన్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ ఆర్థోపెడికల్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గంగాధర్ అర్జీ ఇచ్చారు. ఉద్యోగులకు వారు కోరుకుంటేనే బదిలీ చేయాలని, లేకుంటే ప్రస్తుత స్థితిలోనే ఉంచాలన్నారు.
- కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫీజులను ఇష్టానుసారంగా పెంచేస్తున్నాయని, దీంతో తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఇంకా అక్రమ మైనింగ్ తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు.

తాగునీటి సమస్యపై..

నెల్లూరు రూరల్ అల్లీపురంలో టిడ్కో ఇళ్లలోని అనేక బ్లాకుల్లో కొంతకాలంగా మంచినీరు రాక సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి నీరు సక్రమంగా అందడం లేదని, ఆపరేటర్లను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు సుకన్య, మల్లిక, లక్ష్మి, పద్మ, పున్నమ్మ, శీనయ్య, శేఖర్, మణి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు సంవత్సరం పూర్తయినా ఇప్పటికీ ఎక్కడా ఇళ్ల స్థలాలిచ్చిన దాఖలాల్లేవన్నారు. టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాల్లేవని, వాటిలో ప్రజలు చేరాలంటే భయపడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నేతలు సయ్యద్ సిరాజ్, షాన్వాజ్, వి.రామరాజు, జిలానీఖాన్, కె.ఆంజనేయులు, ముక్తియార్, బీసీ శేఖర్, లీలామోహన్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

హతుడి శరీర భాగాల వెలికితీత

లింగసముద్రం: దారుణ హత్యకు గురైన తోపూరి నరసింహం శరీర భాగాలను సోమవారం వెలికితీశారు. తహసీల్దార్ సీతామహాలక్ష్మి అనుమతితో బావి పక్కన ఎక్స్‌వేటర్‌తో 25 అడుగులు తవ్విన తర్వాత బావికి ఉన్న కేసింగ్ పైపును తొలగించడంతో నరసింహం శరీర భాగాలు కనిపించాయి. నెల్లూరు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు కొన్ని భాగాలు భద్రపరిచి, మిగిలిన వాటికి తహసీల్దార్ పర్యవేక్షణలో శవ పంచనామా నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. హత్య చేసిన చలంచర్ల బ్రహ్మయ్యకు పెంట్రాల ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళ, మరో వ్యక్తి సహకరించారనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. గత నెల 30వ తేదీన నరసింహం బ్రహ్మయ్యని తీసుకుని గొల్లపాళెం దగ్గరున్న నిమ్మతోట వద్దకు వెళ్లాడు. ఇద్దరూ మద్యం తాగి పనిచేస్తుండగా బ్రహ్మయ్య.. నరసింహంను మొద్దుకత్తితో నరికి చంపాడు. అతడి వేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసుకుని మృతదేహాన్ని అక్కడే ఉన్న నల్లటి పట్టలో చుట్టి బైక్‌పై కందుకూరు వెళ్లి ఉంగరాన్ని రూ.40 వేలకు విక్రయించాడు. అక్కడ మద్యం తాగి మరొక బాటిల్ తీసుకుని రాత్రి పెంట్రాలకు వచ్చాడు. ఘటనా స్థలానికి వెళ్లి మద్యం తాగి మృతదేహాన్ని పక్క పొలంలో ఉన్న బోరుబావి వద్దకు ఈడ్చుకుంటూ వెళ్లాడు. అక్కడ ముక్కలుగా కొట్టి బోరుబావిలో పడేశాడు. ఈ కేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా అని పోలీసులు ఆరాతీస్తున్నారు. వెలికి తీసిన శరీర భాగాలకు కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు.

నేడు మైపాడు బీచ్ వద్ద 'యోగాంధ్ర'

నెల్లూరు రూరల్: ఇందుకూరుపేట మండలంలోని మైపాడ్ బీచ్ వద్ద మంగళవారం జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



బొగ్గేరు మడుగులో పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని మహిమలూరు గ్రామంలో పశువులు తోలుకుని వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు బొగ్గేరు మడుగులో పడి మృతిచెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మహిమలూరుకు చెందిన వెంకటేశ్వర్లు (50) రోజులాగే గత నెల 31వ తేదీన బొగ్గేరు బీళ్ల వద్దకు పశువులను తోలుకెళ్లాడు. అవి నీళ్లు తాగేందుకు బొగ్గేరులోకి దిగగా వాటి వెనుక వెళ్లిన వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మడుగులో ఇరుక్కుపోయాడు. అతడి కోసం బంధువులు పలుచోట్ల విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం మడుగు వద్ద వెంకటేశ్వర్లు మృతిచెందిన సమాచారం తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు దుకాణాల్లో డీఆర్‌ఐ తనిఖీలు



కాపువీధిలో అధికారులతో దుకాణాల నిర్వాహకుల వాగ్వాదం

నెల్లూరు సిటీ: నెల్లూరులోని కాపువీధిలో ఉన్న బంగారు దుకాణాల్లో డీఆర్‌ఐ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. కొందరు బంగారం అక్రమ రవాణా చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కర్ణాటకకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు నగరంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ రాష్ట్రంలో ఇటీవల పట్టుబడిన అక్రమ బంగారం విషయంలో నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి పేరు ఉండటంతో విచారణ నేపథ్యంలో తనిఖీలు చేసినట్లు తెలిసింది. కాగా అధికారులపై వ్యాపారులు తిరగబడ్డారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. సంతపేట పోలీసులకు అధికారులు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ క్రమంలో ఓ దుకాణ నిర్వాహకుడు భవిశ్‌జైన్‌ను విచారణ నిమిత్తం చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని డీఆర్‌ఐ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆ దుకాణంలోని పలు రికార్డులు, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు.

దళితుల భూములపై టీడీపీ నేత కన్ను

- అధికారులకు బాధితుల ఫిర్యాదు
- రక్షణ కల్పించాలని వినతి



పత్రాలు చూపుతున్న బాధితులు

చేజర్ల(ఆత్మకూరు): దళితులకు ఐదు దశాబ్దాల క్రితం ప్రభుత్వం కేటాయించిన భూములపై టీడీపీ నేత కన్ను పడింది. ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సోదరుడు కొమ్మి సిద్దులు నాయుడు ఆ భూములను ఆక్రమించేందుకు, దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు. వారి వివరాల మేరకు.. చేజర్ల మండలం పెళ్లేరు పంచాయతీ మజరా పుల్లనీళ్లపల్లి గ్రామంలో సర్వే నంబర్ 511లో మాజీ సైనికుడు చేజర్ల పెంచలయ్యకు 5 ఎకరాల భూమిని మంజూరు చేశారు. అదే క్రమంలో గ్రామంలోని పలువురు దళితులకు సుమారు 38 ఎకరాలు భూ పంపిణీలో దక్కాయి. పెంచలయ్య తన భూమిని 2008లో ఇద్దరు కుమార్తెలకు రిజిస్ట్రేషన్ చేసిచ్చాడు. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక సిద్దులు నాయుడు పొలాల సర్వే నంబర్లను తారుమారు చేసి మొత్తం 43 ఎకరాలను తన కుటుంబ సభ్యుల పేర్లతో అడంగల్‌లో ఎక్కించాడు. దీని విషయమై అప్పటి నుంచి బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పెంచలయ్య కుమార్తెలు దొంతాలి పెంచలమ్మ, చిట్టెమ్మలు హైకోర్టులో 2021లో కేసు దాఖలు చేశారు. ఈ కేసు కోర్టులో నడుస్తోంది. సిద్దులు నాయుడు ఆ భూమిని తమకు కౌలుకు ఇచ్చారంటూ ఆదివారం టీడీపీకి చెందిన చోటా నేతలు చిన్నం పరంధామయ్య, పెంచల ప్రసాద్, చిన్నం ప్రేమ్‌కుమార్, ఐతా హరిబాబు దౌర్జన్యంగా దున్నేందుకు ప్రయత్నించారు. బాధిత కుటుంబాల వారు అడ్డుకున్నారు. ఓవైపు హైకోర్టు ఆదేశాల మేరకు పొలంలో ఎవరూ దిగరాదని, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టినా లెక్క చేయకుండా దున్నేందుకు ప్రయత్నిస్తున్నట్లు దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చెడు వ్యసనాలకు బానిసై చిత్రహింసలు

- కుమారుడిపై వృద్ధురాలి ఫిర్యాదు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'నా చిన్న కుమారుడు చెడు వ్యసనాలకు బానిసై నగదు కోసం చిత్రహింసలు పెడుతున్నాడు. అతడి బారి నుంచి రక్షణ కల్పించండి' అని అల్లూరుకు చెందిన ఓ వృద్ధురాలు కోరారు. సోమవారం నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 104 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ జి. కృష్ణకాంత్‌కు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, కావలి డీఎస్పీ పి.శ్రీధర్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- నా కుమారుడికి ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని పోలీస్ కాలనీకి చెందిన శివయ్య రూ.15 లక్షలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసగించాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ వినతిపత్రం ఇచ్చారు.
- నేను జొన్నవాడలోని ఓ దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్నాను. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన ఓ మహిళ పూజ చేయించుకున్నారు. అనంతరం నా నంబర్‌ను తీసుకుని తరచూ ఫోన్లు చేస్తూ చెప్పినట్లు వినాలని లేనిపక్షంలో పరువు తీస్తానని బెదిరిస్తోంది. నా కుటుంబ సభ్యులు, బంధువులకు అసత్య మెసేజ్‌లు పంపుతూ బెదిరిస్తోందని నెల్లూరు దర్గామిట్టకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- రెండు నెలల్లో నా ఇంటిపై రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు లోన్ ఇప్పిస్తానని నగరానికి చెందిన షేక్ జానీ నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా లోన్ ఇప్పించకపోగా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని నవాబుపేటకు చెందిన ఓ మహిళ వినతిపత్రమిచ్చారు.
- నా కుమారుడు లండన్‌లో చదువుతున్నాడు. అతడికి రూ.1.02 లక్షలు పంపించాలని చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న ఓ కంపెనీకి చెందిన అవినాష్‌రెడ్డిని సంప్రదించాను. ఆయన పంపుతానని నగదు తీసుకుని మోసగించారు. డబ్బు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడని బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- కోవూరుకు చెందిన రషీద్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి కోరారు.
- అనిల్ అనే వ్యక్తి వేధిస్తున్నాడు. ఇప్పటికే పలుమార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా ప్రవర్తనలో మార్పు రాలేదు. అతని బారి నుంచి రక్షణ కల్పించాలని సంగం ప్రాంతానికి చెందిన ఓ మహిళ అర్జీ ఇచ్చారు.
- అదనపుకట్నం కోసం నా భర్త వేధిస్తున్నాడు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని వింజమూరుకు చెందిన ఓ మహిళ కోరారు.

అంతా ఒక్కటై అక్రమ కేసులు పెట్టారు

సంగం: అన్నారెడ్డిపాళెంలో ఓ మహిళకు ఇచ్చిన డబ్బులు అడిగినందుకు కక్ష సాధింపుగా పోలీసులంతా ఒక్కటై ఏడుగురు మహిళలు, ఓ వ్యక్తిపై అక్రమ కేసులు నమోదు చేశారు. బాధితుల కథనం మేరకు.. అన్నారెడ్డిపాళేనికి చెందిన కోర్టు హెడ్‌కానిస్టేబుల్ వెంకటబాబు వదిన శైలజ పలువురి వద్ద రూ.లక్షలు అప్పు చేసి ఎగ్గొట్టింది. తనపై మూడురోజుల క్రితం అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన భీమతాటి సుశీలమ్మ, భీమతాటి షారు, విడవలూరు ప్రసన్న, మీదూరి అరుణమ్మ, భీమతాటి పద్మమ్మ, మోడేగుంట రమణయ్య, భీమతాటి శ్రీవిద్య, బెల్లంకొండ వరలక్ష్మి మూకుమ్మడిగా దాడి చేసిన తీవ్రంగా గాయపరిచారంటూ శైలజ ఓ ఆస్పత్రిలో చేరి హైడ్రామా నడిపింది. వెంకటబాబు పోలీస్ పవర్‌తో సంగం పోలీస్‌స్టేషన్‌లో ఆ ఎనిమిది మందిపై అక్రమ కేసు నమోదు చేయించాడు. సోమవారం ఉదయం వారిని కోవూరు కోర్టుకు తరలించారు. జడ్జి స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో సంగం ఎస్సై రాజేష్‌తోపాటు కానిస్టేబుళ్లకు చుక్కెదురైంది. అక్రమ కేసులను పెట్టించిన వెంకటబాబుపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.